సంపుటి: 5 | సంచిక: 3
మార్చి - ఏప్రిల్, 2017

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



## పునరుత్థానమును జీవమును నేనే;

నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును;



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

యేసుక్రీస్తునందు ప్రియులైన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వకమైన శుభములు. గత కాలం దేవుడు మిమ్ములను మీ పిల్లలను కాచి కాపాడినందుకు ఎంతో ఋణస్థులు. ప్రస్తుతం పరీక్షల సమయం, సంవత్సరము మొత్తం చదువుకున్న విషయములన్నింటి పై జరుగుతున్న పరిశీలనలే పరీక్షలు అంటారు. పిల్లలతో పాటు పెద్దవాళ్ళు కూడా ఎంతో ఆందోళనతో ఉండడం మనం గమనిస్తూ ఉన్నాం.

దేవునియందు విశ్వాసము కలిగిన ప్రతి ఒక్కరూ ఎగ్జామ్స్ విషయములో అనవసర ఆందోళన చెందకుండా పిల్లలను మంచి వ్యక్తిత్వము గలవారిగా తీర్చిదిద్దడం పట్ల శ్రద్ధ కలిగి ఉంటే ఎంతో మంచిది. ఎందుకంటే నేటి సమాజములో చదువులలో ప్రతిభ కనపరిచే వారికి కొదువ లేదు కానీ సరియైన వ్యక్తిత్వం లేని వారు ఎంతో మంది ఉన్నారు. వారి యొక్క అవసరత ఎంతో ఉంది. మంచి మార్కులు వచ్చాయని లేక డిగ్రీలు ఉన్నాయని వారిని ప్రయోజకులు అని అనలేము, కారణం వారి అవివేకపు లేక అతి విశ్వాసముతో కూడిన ప్రవర్తన. కనుక పిల్లలను ఎప్పుడూ తమను గూర్చి తాము ఆలోచించుకునే స్వార్థపరులుగా కాకుండా తల్లితండ్రులు, తోడబుట్టిన అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు తరువాత బంధుమిత్రులు, సమాజము గురించి ఆలోచించేవారిగా తీర్చిదిద్దుటకు ప్రయత్నించవలయును. దీనిని లోతుగా మనం గమనించినట్లయితే బైబిల్ గ్రంథములో దేవుడు వ్రాయించిన విషయములు ఎంతో మేలు కలిగించేవిగా కనిపిస్తాయి. ఇయ్యుడి మీకు ఇవ్వబడుతుంది అనే మాట ఎంతో అర్థవంతమైనది. ఇతరులకు నీవు ఏమి చేస్తావో దానిని బట్టి నీ జీవితములో జరిగేవి ఆధారపడి ఉంటాయి అనగా దేవుడు నీకు ఇస్తాడు. ఇది అర్థం అయితే స్వార్థం అనే దానికి తావు ఉండదు. స్వార్థం ఎక్కడ ఉండదో అక్కడ మనుష్యుల జీవితములు ధన్యకరమైనవి.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

మీ సహోదరుడు.....

సంపుటి: 5 | సంచిక: 3 మార్చి - ఏప్రిల్, 2017

# దేవుని స్పర్శ

## ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

ఈ సంచికలో...


| | |
|---|---|
| పునరుత్థానం | 2 |
| ఇవి తెలుసా? | 5 |
| తన్ను తాను అర్పించుకొని(స్త్రీల ప్రత్యేకం) | 7 |
| సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర – 51వ భాగము | 10 |
| సామర్థ్యము (బాలల శీర్షిక) | 12 |
| నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) | 14 |
| ప్రార్థనా వీరునిగా ఉండటం ఎలా? | 16 |
| ధనము..... | 19 |
| సులభమైన ప్రార్థనా శక్తి | 20 |
| బైబిల్ క్విజ్ – 51 | 22 |
| జన్మదిన శుభాకాంక్షలు | 23 |


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్–500 070, ఫోన్: 040–2420 2227

# పునరుత్థానం

- బ్రదర్. ఎపఫ్రా

ప్రభువైన యేసుక్రీస్తు 2000 సంవత్సరముల క్రితం ఈ లోకమునకు వచ్చి, ఈ లోకములో జీవించిన 33 1/2సం॥ల కాలములో నీతిగానూ, యథార్థముగాను ఉండి సమస్త మానవాళి పాపశిక్షను తన శరీరము మీద భరించి, సిలువలో వ్రేలాడి మరణించి మూడవ దినమున తిరిగి లేచెను. దీనినే మనం ఈస్టర్ గానూ, పునరుత్థానపు ఆదివారముగాను ఆచరిస్తాము.

ఆయన మృతులలో నుండి మూడవ దినం తిరిగి లేచి మరణమును జయించి పునరుత్థానుడై శిష్యులకు, కొందరు స్త్రీలకు కనిపించి చెప్పిన మాటలు నేటికీ మన జీవితములకు ఎంతో ప్రాముఖ్యమైనవి.

**1. యేసు – భయపడకుడి మీరు వెళ్ళి, నా సహోదరులు గలిలయకు వెళ్ళవలెననియు వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడనెను. మత్తయి 28:10**



యేసుక్రీస్తు సిలువవేయబడిన తరువాత మూడవ దినమున ఆయనను వెదకుచున్న స్త్రీలకు దూత కనపడి భయపడకుడి యేసు ఇక్కడ లేడు ఆయన మృతులలో నుండి లేచియున్నాడని చెప్పెను. ఈ వార్తను శిష్యులకు తెలియచెప్పవలెనని వారు భయముతోనూ, మహా ఆనందముతోనూ, పరిగెత్తుచుండగా యేసు వారిని ఎదుర్కొని భయపడకుడి అని చెప్పెను. మన జీవితములో కుటుంబ సమస్యలను బట్టి, భవిష్యత్తును బట్టి, పరిస్థితులను బట్టి హృదయములో భయమును కలిగి, కలవరపడుతూ ఉంటాము. భయము మనలను కృంగిపోయేవారిగా చేసి, నిరీక్షణ లేనివారిగా, ఏ పనిని చేయలేని వారిగా మారుస్తుంది. అందుకే మనము పునరుత్థానుడైన యేసయ్య స్త్రీలైన వారితో **భయపడకుడి** అని చెప్పిన ఆ మాటను హృదయములో చేర్చుకొని ఆయన మీద విశ్వాసముంచి, వెంబడించే వారిగా ఉన్నప్పుడు ఏ పరిస్థితులకు భయపడము. సమస్య కలిగినను, నింద, అవమానము కలిగిననూ పునరుత్థానుడైన యేసును చూచుచు నిర్భయముగా జీవిస్తూ ముందుకి కొనసాగుదాము.

 **మానవుడు ఎంత గొప్పవాడైతే, అంత కఠినమైన పరీక్షలను దాటవలసి ఉంటుంది.**

**2. ఆదివారము సాయంకాలమున శిష్యులు యూదులకు భయపడి, తాము కూడియున్న ఇంటి తలుపులు మూసికొని యుండగా యేసు వచ్చి మధ్యను నిలిచి – మీకు సమాధానము కలుగును గాక అని వారితో చెప్పెను. యోహాను 20:19**

ఆయన శరీరధారియైన దినములలో శిష్యులు ఆయనను వెంబడించుచూ, ఆయనతోనే ఉండి అనేక ఆశ్చర్యకార్యములను చూచిరి. ఆయన సిలువవేయబడి మూడవ దినమున తిరిగి లేస్తానని చెప్పినప్పటికి ఆయన సిలువ వేయబడిన తరువాత భయముతో, హృదయములో కలవరముతో గదిలో ఉండగా వారికి యేసయ్య ప్రత్యక్షమై **మీకు సమాధానము కలుగును గాక** అని చెప్పెను. మన జీవితములో కూడా చాలా సార్లు అనేకమైన విషయములను బట్టి, లోకాశలను బట్టి హృదయములో సమాధానము పోగొట్టుకొని, సంతోషము లేక జీవిస్తూ ఉంటాము. అయితే మనకు, మన కుటుంబములకు సమాధానము అనుగ్రహించుటయే ఆయన ఉద్దేశ్యమై యున్నది. ఆయనను అంగీకరించిన వారి జీవితములో మొట్టమొదట హృదయములో సమాధానము కలుగుతుంది. హృదయములో ఉన్న సమాధానము మనలను సంతోషముగా ఉంచుతుంది. నా శాంతినే మీకనుగ్రహించుచున్నాను అని చెప్పబడిన మాటను మనము నమ్మాలి. ఆయన మనకు అనుగ్రహించిన శాంతి, సమాధానము ఈ లోకములో మనుష్యులెవ్వరు ఇవ్వలేరు. ఆయన శిష్యులు అనేకులను బలపరచి, ధైర్యపరచాలంటే మొట్ట మొదట వారి హృదయములో సమాధానము ఉండాలని ఆయన ఎరిగి వారితో పలికిన ఆ మాట మనతో కూడా మాట్లాడుచున్నారని గ్రహించుకొని మనము సమాధానముతో జీవిస్తూ, అనేకులను బలపరిచే వారిగా ఉందాము.

**3. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. మత్తయి 28:19**



**సమస్త జనులను నా శిష్యులుగా చేయుడి** అని దేవుడు చెప్పిన మాట ఎంతో లోతైన అర్థమును మనకు కనుపరచుచున్నది. ఆది యందు ఆదాము, హవ్వలు చేసిన పాపమును బట్టి ఈ లోకమునకు కలిగిన శాపము నుండి దేవుడు మనలను విడిపించుటకు సిద్ధపరచిన ఆయన రక్షణ కార్యములో మనం నడవాలని కోరుకొనుచున్నాడు.

సమస్త జనులను శిష్యులుగా చేయుట అనగా ఆయన ప్రేమను, దయను, కనికరమును, మంచితనమును, క్షమాగుణమును కలిగి జీవించే వారిగా తీర్చిదిద్దుటయే. ప్రతి మనుష్యుడూ ఈ విధమైన సుగుణములను కలిగి జీవించుట వలన లోకములో నెమ్మది, ఈ భూమి మీద మనుష్యులకు శాంతి కలుగుతాయి. మొదటి మనుష్యుడైన

ఆదాము ద్వారా పోగొట్టుకొనిన ఆశీర్వాదము ఆయన శిష్యులుగా మనము మారుట ద్వారా తిరిగి పొందగలము. ఆయన సమస్త జనులను శిష్యులుగా చేయుడి అని చెప్పిన మాట శిష్యులైన పదకొండు మందికే కాక నేడు ఆయనను విశ్వసించిన ప్రతివారు ఈ లోకములో ఉన్న సమస్త జనులను ఆయనకి శిష్యులుగా చేయాలన్న తపనతో ప్రతిదినము జీవించవలసిన వారమై యున్నాము. నిజమైన శిష్యులు మాత్రమే మరికొందరిని శిష్యులుగా చేయగలరు. యేసయ్య మాటను విన్న ఆ పదకొండు మంది శిష్యులు తమ ప్రాణములను కూడా లక్ష్యపెట్టక, ప్రపంచవ్యాప్తంగా అనేకులను శిష్యులుగా తీర్చిదిద్దారు. మనము కూడా మన జీవిత కాలములో అనేకులను ఆయన శిష్యులుగా సిద్ధపరచవలసిన వారమై యున్నాము.

**4. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నానని వారితో చెప్పెను మత్తయి 28:20**

యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో కూడా ఉన్నాను అని ఆయన పునరుత్థానుడై తిరిగి లేచిన తరువాత చెప్పిన మాట ఎంతో అద్భుతమైనది ఎందువలననగా ఆయన శరీరధారిగా ఉన్న దినములన్నిటా ఆయన కేవలము ఒకచోట ఉండుట మాత్రమే సాధ్యమయ్యింది. ఆయన పునరుత్థానుడై తిరిగి పరలోకమునకు వెళ్ళిన తరువాత ఆత్మస్వరూపిగా అనగా పరిశుద్ధాత్మ దేవునిగా ఎల్లప్పుడూ మనతోనూ, మనలోనూ ఉంటానని వాగ్దానము చేసారు. యోహాను 14:16 ప్రకారము ఆదరణకర్తగా మనలో ఉండటం, మనతో ఉండటం ఎంతో ధన్యకరమైనది. ఈ దినములలో ప్రతి మనిషికి వేరొక మనుష్యుడు తోడై ఉన్నట్లుగా పరిశుద్ధాత్మ దేవుడు ఆయనను విశ్వసించి, పాపక్షమాపణ పొందిన ప్రతి వ్యక్తితో కూడా ఉండటం ఎంతో ఆశ్చర్యమును కలిగిస్తుంది. ఈ లోకములో తల్లిదండ్రులైనా, అన్నదమ్ములైనా, కన్నబిడ్డలైనా కొంతవరకే మనతో ఉండగలుగుతారు. వాక్య ప్రకారము ఏకశరీరము అనుకొనే భార్యాభర్తలు కూడా అన్ని సమయములలోనూ ఒకరితో ఒకరు కలిసి ఉండలేరు. పరిశుద్ధాత్మ దేవుడు భాదలలో నెమ్మదిని కలిగించి దుఃఖసమయములలో ఓదార్చి, కృంగిన సమయములలో ధైర్యపరచి, వాక్యములను మనకు జ్ఞాపకము చేయుచూ, పాపములను ఒప్పింప చేస్తూ మన జీవితమును నడిపిస్తారు. లోకము ఆయనను చూడదు, ఆయనను ఎరుగదు, మనమైతే ఆయనను ఎరుగుచున్నాము, ఆత్మీయ నేత్రములతో చూచుచున్నాము. యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో కూడా ఉన్నాను అనే వాగ్దానమునకు మనము వారసులమై యున్నాము.



# ఇవి తెలుసా ?

| | | |
|---|---|---|
| 1. బైబిల్ మొత్తము పుస్తకాలు | - | 66 |
| 2. పాత నిబంధన | - | 39 |
| 3. క్రొత్త నిబంధన | - | 27 |
| 4. పాత నిబంధన అధ్యాయాలు | - | 929 |
| 5. క్రొత్త నిబంధన | - | 260 |
| 6. బైబిల్ మొత్తం | - | 1189 |
| 7. పాత నిబంధన వచనాలు | - | 33214 |
| 8. క్రొత్త నిబంధన | - | 7959 |
| 9.బైబిల్ మొత్తం వచనాలు | - | 41,173 |
| 10. పాత నిబంధన పదములు | - | 5,93,493 |
| 11. కొత్త నిబంధన పదములు | - | 1,81,253 |
| 12. పాత నిబంధన అక్షరములు | - | 27,21,100 |
| 13. క్రొత్త నిబంధన | - | 8,45,380 |
| 14. బైబిల్ మొత్తం | - | 35,66,380 |
| 15. పాత నిబంధన “విమోచన” గూర్చి వచనములు | | 4,734 |
| 16. క్రొత్త నిబంధన | - | 2,934 |
| 17. బైబిల్ మొత్తం | - | 7,670 |
| 18. బైబిల్ మొత్తం వాగ్దానములు | - | 30,000 |
| 19. బైబిల్ మొత్తం ఆజ్ఞలు | - | 6,468 |
| 20. బైబిల్ మొత్తం ప్రవచనాలు | - | 5,355 |
| 21. నెరవేరిన ప్రవచనాలు | - | 3,268 |
| 22. బైబిల్ మొత్తం ప్రశ్నలు | - | 3,294 |
| 23. బైబిల్ మొత్తం దీవెనలు | - | 8000 |
| 24. బైబిల్‌లో పెద్ద పుస్తకం | - | కీర్తనలు |
| 25. బైబిల్ చిన్న పుస్తకం | - | యోహాను 3వ పత్రిక |
| 26. బైబిల్ పెద్ద అధ్యాయం | - | కీర్తన 119 |
| 27. బైబిల్ చిన్న అధ్యాయం | - | కీర్తన 117 |
| 28. బైబిల్ పొడవైన వచనం | - | ఎస్తేరు 8:9 |

29. బైబిల్  చిన్నవచనం - 1 థెస్స 5:19
30. బైబిల్ మధ్య వచనము - కీర్తన 118:8
31. పాత నిబంధన మధ్య పుస్తకం - సామెతలు
32. క్రొత్త నిబంధనలో మధ్య పుస్తకం - 2 థెస్స
33. బైబిల్ మధ్య పుస్తకం - మీకా, నహూము
34. పాత నిబంధన మధ్య అధ్యాయము - యోబు 29
35. క్రొత్త నిబంధన మధ్య అధ్యాయం - రోమా 13
36. బైబిల్ లో మధ్య అధ్యాయం - కీర్తన 117
37. బైబిల్ లో పొడవైన పేరు - మహేరుషాలాల్ హష్ బజ్ యెషయా 8:3
38. "పరిశుద్ధత" అను మాట పాత నిబంధనలో - 830 సార్లు
39. క్రొత్త నిబంధన - 250 సార్లు
40. యెహోవా అను మాట - 7000 సార్లు
41. "దేవుడు మాట్లాడెను" అను మాట - 3000
42. "ప్రభువు" అను మాట - 1855 సార్లు
43. ఏడు అనే సంఖ్య బైబిల్‌లో - 120 సార్లు
44. భయపడకుము అనేమాట - 366 సార్లు
45. యేసు అనే పదం - 973 సార్లు
46. దేవదూతలు అనే పదం - 309 సార్లు
47. యేసు ప్రభువని - క్రొత్త నిబంధనలో - 747 సార్లు
48. యేసు ప్రభువని, అపోస్తులుల కార్యములు - 92 సార్లు
49. "సెలా" అనే పదం - 71 సార్లు
50. దేవుని రాకడ గురించి - 568 సార్లు

# తన్ను తాను అర్పించుకొని

- సిస్టర్ విజయ

**క్రీస్తు సంఘమును ప్రేమించి మరియు దాని కొరకు తన్ను తాను అప్పగించుకొనెను. (ఎఫెసీ 5:25)**

సంఘమును కట్టుటకు, యేసు సంఘమును ఏ విధంగా ప్రేమించారో అదే విధంగా మనము ప్రేమించవలసియున్నది. మన డబ్బును లేక సమయమును ఇచ్చినచో సరిపోదు కానీ సంఘము కొరకు మనలను మనమే ఇచ్చుకొనవలెను. అనేకమైన వాటిని త్యాగం చేసేవారిగా ఉండాలి.

మానవులమైన మన యెడల దేవుని ప్రేమను వివరించాలంటే ఆయన పరలోకములో హాయిగా కూర్చొని క్రీస్తు ప్రేమ సందేశములు పంపుతూ క్రియ చేయకుండా లేరు కాని మన కొరకు ఈ లోకమునకు వచ్చి తనని తాను అర్పించుకున్నారు. సంఘమును సంరక్షించి పోషించుచున్నారు. భూమి మీద ఒక ఉదాహరణను చూచినట్లైతే స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటి పిల్లను మరచునా? (యెషయా 49:15) అని బైబిల్ గ్రంథములో చెప్పబడినట్లుగా ఒక తల్లిని మనం గమనించినట్లైతే, చంటి బిడ్డ యెడల తల్లిప్రేమ పూర్తిగా త్యాగముతో నిండియుండును. ఉదయము మొదలుకొని రాత్రి వరకును మరియు రాత్రి అంతా తల్లి బిడ్డ కొరకు త్యాగములు, త్యాగములు మరియు త్యాగములు చేయుచుండును. ఈ త్యాగమునకు బదులు తిరిగి ఆమె ఏదియు కోరుకోదు, ఎటువంటి ప్రతిఫలమును కోరుకొనక సంవత్సరము తరువాత సంవత్సరము సంతోషముతో ఆ బిడ్డ కొరకు బాధను మరియు ఇబ్బందులను భరించును. దేవుడు కూడా అదే విధంగా మనలను ప్రేమించుచున్నారు మరియు అదే స్వభావమును మనలో కలుగజేయవలెనని ఆయన కోరుచున్నాడు. దైవికమైన ప్రేమను పొందుటయే గురిగా మనము ప్రయత్నించవలెను.

ఒక తల్లి తన చుట్టు ప్రక్కల ఉన్నవారు తమ బిడ్డలకు ఏదైనా త్యాగము చేయుచున్నారా లేదా అనేది ఆమె లెక్కచేయదు. తనంతట తానే సంతోషముగా అంతయూ త్యాగము చేయును. అదే విధముగా సంఘమును తన స్వంత బిడ్డగా చూచిన వ్యక్తి, తన చుట్టు ప్రక్కల ఉన్నవారు సంఘమునకు త్యాగము చేయుచున్నారా, లేదా అని పట్టించుకోరు కానీ తనకు తానుగా సంతోషముగా త్యాగము చేయును. అంతేకాక అలాంటి వారికి ఎవరి మీదా కంప్లైంట్ చేయాలనే కోరిక కూడా ఉండదు. సంఘమునకు వేరే వాళ్ళు త్యాగము చేయుట లేదు అని కంప్లైంట్ చేసేవారు తల్లులు కాదు కాని జీతమునకు పనిచేయు

నర్సులవలె ఉందురు. అటువంటి నర్సులు 8 గంటలు పనిచేసిన తరువాత, తరువాత షిఫ్ట్ (8 గంటలు) పనిచేయు నర్సు సమయమునకు రానియెడల కంప్లైంట్ చేసెదరు. కాని ఒక తల్లి ప్రతిరోజు 8 గంటలు మాత్రమే పనిచేయదు. ఆమె ప్రతిరోజు 24 గంటలు పనిచేయును, ఆ విధముగా అనేక సంవత్సరములు పనిచేయును. అయినను దానికి ప్రతిఫలముగా ఏమీ పొందదు మరియు పొందాలనే తలంపు కూడా ఉండదు. బిడ్డకు 20 సం॥లు వచ్చినమా, ఆమె పని పూర్తి అవ్వదు.

ఒక తల్లి తన బిడ్డల నుండి జీతము కోరదు, తల్లి చేసిన సేవకు ఏ బిడ్డ కూడా జీతము ఇవ్వదు. నిజానికి నర్సుల వలె తల్లికి గంటకు 20 రూపాయిల చొప్పున లెక్కించినచో, బిడ్డకు 20 సంవత్సరముల వయస్సు వచ్చినప్పటికి ప్రతి బిడ్డ తల్లికి 30 లక్షల రూపాయిలు చెల్లించవలసియుండును. ఏ బిడ్డయైనా తల్లికి అంత సొమ్ము చెల్లించగలడా ?

ఇప్పుడు ప్రశ్న ఏమనగా దినము తరువాత దినము, సంవత్సరము తరువాత సంవత్సరము యేసుప్రభువు మరలా వచ్చు పర్యంతము జీతము తీసికొనకుండా తనను తానే అర్పించుకొంటూ ప్రభువు కొరకు మరియు ఆయన సంఘము కొరకు పని (పరిచర్య)చేయు వారెవరైనా ఉన్నారా? త్యాగము చేసే ఆత్మ లేకుండా ప్రభువును సేవించుటకు ప్రయత్నించే 10,000 మంది సగము హృదయముతో ఉన్న విశ్వాసుల కంటే, త్యాగము చేయుటకు సిద్ధముగా ఉన్న ఒక్క వ్యక్తిని దేవుడు ఎక్కడైననూ కనుగొనినచో, ఆయన సంఘమును కట్టుటకు ఆ వ్యక్తిని దేవుడు వాడుకొనును.

బైబిలు గ్రంథములోని లేఖనములను పరిశీలించినప్పుడు ఇట్టి త్యాగముతో కూడిన హృదయముతో దేవుని పరిచర్య చేసిన అకుల, ప్రిస్కిల్ల అను వారిని కనుగొనవచ్చును. వీరు ఇటలీ నుండి క్రొత్తగా కొరింథునకు వెళ్ళినవారు. వృత్తికి డేరాలు కుట్టేవారు. పౌలు అదే వృత్తి గలవాడు గనుక వారితో కాపురము ఉండెను. వారు కలిసి పనిచేయుచుండిరి. వీరు అనేకులను తమ ఇంట చేర్చుకొని, దేవుని మార్గములను వివరించుచూ, దేవుని కొరకు జీవించే విధముగా ప్రోత్సాహపరచుచూ, సంఘం కొరకు ప్రయాసపడునట్లుగా సిద్ధపరిచేవారు. వీరిని గురించి అపో.పౌలు క్రీస్తుయేసు నందు నా జతపనివారైన ప్రిస్కిల్లకు, అకులకును నా వందనములు చెప్పుడి, వారు నా ప్రాణము కొరకు తమ ప్రాణములను ఇచ్చుటకైనను తెగించిరి. మరియు వారి ఇంట ఉన్న సంఘమునకును వందనములు చెప్పుడి (రోమా 16:3,4) అని సాక్ష్యమిచ్చుచున్నాడు. ఈ సాక్ష్యమును బట్టి అకుల, ప్రిస్కిల్ల అను వీరు కుటుంబముగా ఎంత త్యాగ సహితముగా తమ్మును తాము అర్పించుకొని, సంఘమును కట్టడానికి ఆ దినములలో ప్రయాసపడ్డారో అర్థమవుతుంది.

ప్రియ సహోదరీ! అకుల, ప్రిస్కిల్ల అను వారి జీవితములను ధ్యానించినప్పుడు, వారు డేరాలు కుట్టుట అనే అతిసామాన్యమైన వృత్తిలో ఉన్నప్పటికి చింతించిన వారు కారు. వారు ఉన్న స్థితిలో సంతృప్తి కలిగి జీవిస్తున్నారని మనకి అర్థం అవుతుంది. ఎంతో సమర్పణతో సేవ చేస్తున్న మరియు యేసుక్రీస్తు తరువాత అంతటి శ్రమలు పొందిన అపోస్తలుడిగా పేరు గాంచిన పౌలు నా జతపనివారు అని వీరిని గూర్చి సాక్ష్యమివ్వడం చూస్తుంటే వీరు దేవుని పరిచర్యలో ఎంత ప్రయాసపడ్డారో మనకి అర్థమవుతుంది. పుట్టుకతోనే ఇలాంటి త్యాగపూరితమైన మనసుతో పుట్టేవారు ఎవరూ ఉండరు కానీ, జీవితములో వాక్యమును బట్టి పురికొల్పబడుట, భక్తుల జీవితముల ద్వారా ప్రేరేపించబడి త్యాగసహితమైన జీవితం జీవించడం జరుగుతుంది.

కనుక మన జీవితములలో దేవుని కొరకు జీవించవలసిన సమయములు వచ్చినప్పుడు ఏవేవో సాకులు చెబుతూ మనలను మనం సమర్థించుకుంటూ, దేవుని పక్ష ముగా నిలిచే అవకాశమును పోగొట్టుకొనవద్దు. అకుల, ప్రిస్కిల్ల అను వారి చిన్న కుటుంబములో వారికి వచ్చిన అవకాశములో దేవుని కొరకు జీవించి, మన అందరికి ప్రోత్సాహకరంగా ఉన్నారు. మన జీవితములో కూడా అట్టి ధన్యతను దేవుడు కలుగజేయును గాక!

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.00 గం॥ల నుండి సాయంత్రం 6.00 గం॥ల
వరకు సంప్రదించగలరు.

---


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 51వ భాగము**

నన్ను గుర్తు పట్టారా అన్న మాటలతో తలెత్తి చూచాడు సుందర్. వెంటనే ఆయన కన్నులు కృతజ్ఞతాభావంతో ఒక్కసారిగా మెరిసిపోయాయి. మనస్సు గతంలోనికి దూసుకుపోయింది. తనకు విషం పెట్టిన ఆ రాత్రి స్థానిక ఆసుపత్రి నుండి మందులివ్వడానికై ఈ వ్యక్తిని పిలిచిన సంఘటన ఆయన కనుల ముందు కదలాడింది. అవునండీ నేను మిమ్ములను మరచిపోలేదు. మరణపడకలో నున్న నన్ను చూచేందుకు మీరు వచ్చారు గదా అని తన కృతజ్ఞతను వెల్లడించాడు సుందర్. ఆ దినాన్న సుందర్ సింగ్ అద్భుతంగా స్వస్థపడడాన్ని చూచిన ఈ వైద్యుడు ఆశ్చర్యపడినాడు. ఇతడు బైబిల్ చదవడానికి, యేసుక్రీస్తును విశ్వసించడానికి ఆ సంఘటన దారి తీసింది. ప్రస్తుతం నేను బర్మాలో మిషనెరీగా సేవ చేస్తున్నానని సుందర్‌కు తెలియజేశాడు. మొట్టమొదటిగా భారత ఉపఖండం వెలుపల సేవ చేయడానికి బర్మా వెళ్ళాడు సుందర్. సుందర్ జీవితములో చెప్పుకోదగ్గ సంఘటనలకది నాంది. ఆ తరువాత కాలంలో తాను ఎల్లప్పుడూ ధరించే కాషాయ వస్త్రాల్లోనే ఐరోపా, ఆస్ట్రేలియా, అమెరికాలకు వెళ్ళాడు సుందర్. ఆ దేశాలలో కూడ పాదములకు చెప్పులనే వేసికొన్నాడు. పలుకుబడి గల ధర్మకర్తలు గాని, దాతలు గాని, మంచి ఆర్థిక స్తోమతగల సంస్థలు గాని తన వెనుక లేకపోయిననూ ఖరీదైన బహుమానములను, పెద్ద మొత్తాలలో ఇవ్వజూపిన డబ్బును నిరాకరిస్తూ జీవము గల దేవుని మీదే విశ్వాసముంచడం లోని వాస్తవికతను తెలియజేసేవానిగా ఉండినాడు. ఆయన వెళ్ళిన ప్రతి చోటనూ సువార్త ప్రచారానికి పుష్కలమైన అవకాశములు లభించాయి. విదేశ సేవ ముగించుకొని మరలా విదేశాలకు వెళ్ళేది లేదనుకుంటూ 1923 లో ఆయన భారత దేశమునకు తిరిగి వచ్చేసరికి మా మధ్యకు వచ్చి సువార్త పరిచర్య చేయమని కోరుచూ విదేశాల నుండి ప్రతిరోజూ అసంఖ్యాకమైన ఉత్తరాలు రావడం మొదలైనది. ఆ దేశాలకు వస్తానని తన అంగీకారం తెలిపే మాట అటుంచి, వాటికి జవాబివ్వడానికి కూడా సమయం దొరకడం కష్టమై పోయింది. అప్పటికే ప్రపంచ ఖ్యాతిని ఆర్జించాడు సుందర్.

1918 వ సంవత్సరం నాటికి ఇండియాలో ప్రజలందరు ఎరిగిన వానిగాను, గౌరవనీయుని గాను అయ్యాడు. దక్షిణ భారతదేశము, శ్రీలంకలో సేవ ముగించుకొని

వచ్చిన తదుపరి విషజ్వర పీడితుడైనాడు. ఈ సమయంలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంటిలో విశ్రాంతి తీసికొన్నాడు. పుస్తకాలు, పత్రికల ద్వారాను మిషనెరీలు తదితరులు అందజేసిన సమాచారముల వలన మాత్రమే విదేశాలలో సుందర్‌ని గూర్చి తెలిసింది. తన స్నేహితుడైన బిషప్ లెఫ్రాయ్‌గారి కంటే ఎంతో ముందుగానే సుందర్ బర్మాను సందర్శించాడు. ఇందు వలన లెఫ్రాయ్‌గారు బర్మా వెళ్ళడానికి మార్గం సుగమమైనది. బర్మాలో వివిధ ప్రాంతాలలో జరిగిన సభలను ఆశించిన దాని కంటే అత్యధికంగా దేవుడాశీర్వదించాడు. దేవునికి స్తోత్రము. ప్రభువు యొక్క ఈ ఘనమైన సేవలో మీకు కూడా మంచి పాలే యున్నది. మీరు దయతో చేసిన సహాయానికి, ప్రార్థనలకు కృతజ్ఞతలని తెలియజేస్తూ బర్మా నుండి వెళ్ళిపోయే ముందు తన స్నేహితుడొకనికి ఉత్తరం వ్రాశాడు సుందర్.

సుందర్ కొద్ది దినములు బర్మాలో ఉండడం వలన, మామూలుగా క్రైస్తవ కూటములకు పరుగెత్తిపోయే జనం మీదనే గాక ఇతరులపై కూడా ఎంతో సత్ప్రభావమును చూపాయి. ప్రయాణికుల రద్దీ పెరగడంతో స్టీం షిప్ కంపెనీ వారు సింగపూర్ నుండి రంగూన్‌కు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారంటే ఆయా దేశాల మీద సుందర్ ప్రభావము ఎంతగా ఉందో ఊహించవచ్చు.

– సేకరించబడింది

(ఇంకా ఉంది)

## ఉపవాస ప్రార్థన

**ఉపవాస ప్రార్థన – 2017, మే 1వ తేది సోమవారం)**

ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.

ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

**వివరములకు:**

9666666249 | 040-24202227



# "సామర్థ్యము'

హలో!! పిల్లలూ, బావున్నారా? చాలా బిజీగా ఉన్నారా? ఎగ్జామ్స్ హడావిడి కదా! అబ్బా! ఈ ఎగ్జామ్స్ లేకుండా ఉంటే బావుణ్ణు అనుకుంటున్నారా? పరీక్షలు ఉండాలర్రా... చదువులోనే కాదు జీవితంలో కూడా పరీక్ష చాలా ఇంపార్టెంట్. మనం జీవితంలో పైకి ఎదగాలన్నా, స్టడీస్ లో ముందుకి వెళ్ళాలన్నా పరీక్షలు అనేవి మనకి చాలా చాలా అవసరం.

చిన్నపిల్లలైన మీరు ఒక్కొక్క క్లాసుకి ఎదగాలంటే పరీక్షలలో మీ సామర్థ్యమును బట్టి పై క్లాసుకి వెళతారు కదా! ఈ ఇయర్ క్లాసులో మీరు ఏ విధంగా చదివారో తెలుసుకునేదే పరీక్ష.. అలాగే ఆత్మీయ జీవితంలో కూడా మన విశ్వాసాన్ని పరీక్షించినపుడు మనలోని భక్తి తెలుస్తుంది. మనకి ఒక టైం ఇవ్వబడుతుంది. ఆ టైం లో మనం సాధన చేయాలి. మీకు ఈ ఇయర్ అంతా చదువుకోవడానికి టైం ఇవ్వబడింది కదా! పిల్లలూ! టైం చాలా వాల్యుబుల్ కనుక ఎప్పుడూ టైం ని వేస్ట్ చేసుకోకూడదు.

ఎగ్జామ్స్ కి బాగా ప్రిపేర్ అవుతున్నారా, భయపడుతున్నారా? దేవునికి ప్రార్థన చేయండి. జ్ఞాపకశక్తి, జ్ఞానం కావాలని అడగండి. ఇంకా మీకు  అర్థం కాని విషయాలు ఏమైనా ఉంటే ఇంట్లోనో, స్కూల్లోనో అడిగి తెలుసుకోండి. మన సామర్థ్యం చాలనప్పుడు ఇతరుల సలహా తీసుకోవడం మంచిది. కాబట్టి ఈ ఎగ్జామ్స్ టైంలో  మరువక తప్పకుండా దేవుని సహాయం కొరకు వేడుకోండి. ఇక స్టోరీ లోకి వెళదామా!

శ్రీను వాళ్ళ నాన్న భాస్కర్ కు చెట్లు, పచ్చదనం అంటే చాలా ఇష్టం. వాళ్ళకి ఒక తోట కూడా ఉంది. ఒకరోజు భాస్కర్ తన తోటలో కలుపు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులు చేస్తున్నాడు. అప్పుడు శ్రీను కూడా తనకు తోచిన పనులు చేస్తూ తండ్రికి సాయం చేస్తున్నాడు. భాస్కర్ తనతోపాటు తోటలో పనిచేస్తున్న తన కొడుకు శ్రీను వైపు చూసి, "శ్రీనూ! నీ ప్రక్క నున్న ఆ రాయిని తొలగించు, మనం అక్కడ ఒక మామిడి మొక్కను నాటుదాం" అన్నాడు.

శ్రీను వెంటనే ఆ రాయిని తొలగించేందుకు ప్రయత్నించాడు. కానీ అది అంగుళం

కూడా కదల్లేదు. 'నాన్నా....' ఈ రాయి చాలా బలంగా పాతుకుపోయింది. దీనిని తొలగించడం నావల్ల కావట్లేదు అని గట్టిగా అరిచాడు. శ్రీను తెలివి తేటలను పరీక్షిస్తున్న భాస్కర్ 'బాబూ! మళ్ళీ ప్రయత్నించు, నీ బలాన్నంతటిని ఉపయోగించి ఎలాగైనా ఆ రాయిని తొలగించు' అని అంతే బిగ్గరగా అరిచాడు.

ఎంత బలంగా ప్రయత్నించినా ఆ రాయి కదలకపోవడంతో శ్రీను ఇంక భరించలేక ఏడవటం మొదలుపెట్టాడు. శ్రీనుని సముదాయించేందుకు అతని వద్దకు వెళ్ళాడు భాస్కర్. 'నేను నీ బలాన్నంతటినీ ఉపయోగించమని చెప్పానా లేదా?' అని ప్రశ్నించాడు భాస్కర్. ఏడుస్తూనే శ్రీను, "అవును నాన్నా, నా శక్తి మేరకు ప్రయత్నించాను. కానీ ఆ రాయి కనీసం కదలను కూడా లేదు", అని చెప్పాడు. 'కానీ శ్రీనూ! నీవు నన్ను మర్చిపోయావు. నీవు నా సహాయం కోరవచ్చు కదా! నీకున్న బలంలో నన్ను కూడా ఒక భాగంగా ఎందుకు అనుకోవు?' అని తండ్రి అనడంతో శ్రీను కళ్ళు జిగేలున మెరిసాయి. ఏడుపు దానంతట అదే ఆగిపోయింది. తండ్రి సహాయంతో ఆ రాయిని సులభంగా పెకిలించిన శ్రీను అక్కడ ఒక చక్కని మామిడి మొక్కను నాటాడు.

చూశారా పిల్లలూ! మనం కూడా చాలాసార్లు మన శక్తిమీదనే ఆధారపడతాము. శ్రీను ప్రక్కనే ఉన్న తండ్రిని సహాయం అడగటం మర్చిపోయి, శాయశక్తులా ప్రయత్నించి, ఓడిపోయి ఏడుస్తున్నాడు. తండ్రి చెప్పిన ధైర్యానికి ఎంతో ఆశ్చర్యపడి తన బలహీనతని తెలుసుకున్నాడు. అలానే మనం కూడ దేవుణ్ణి తల్లితండ్రులను మర్చిపోయి బాధపడుతూ ఉంటాము.

మనము చేస్తున్న పని మన వల్ల కాకపోతే దానిని వదిలేయకూడదు. మొదటిగా దేవుని సహాయం తరువాత తల్లితండ్రుల సహాయం అడగాలి. చదువు విషయంలో కూడా అంతేనర్రా... ఇక చదవలేను, ఎంత చదివినా బుర్రకు ఎక్కడం లేదని దానిని వదిలేయక ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి, కష్టపడి చదవాలి, అప్పుడే జీవితములో పైకి వెళ్తారు. మన బలహీన సమయములలో బలవంతుడైన దేవుని మీద ఆధారపడుతూ, తల్లితండ్రుల సహకారం తీసుకుంటారని ఆశిస్తూ.....

ఆల్ ది బెస్ట్ పిల్లలూ !

ప్రేమతో మీ అక్కయ్య

# నా జీవితములో దేవుని మేలులు

స్వరూప, పెడసనగల్లు

దేవుని నామమునకు స్తోత్రములు, అందరికి నా వందనములు. నా పేరు స్వరూప, కృష్ణాజిల్లా పెడసనగల్లు గ్రామము. మాది మొదటి నుండి క్రైస్తవ కుటుంబమే అయిననూ నామకార్థముగా జీవించేవారము, విశ్వాసము అంతగా ఉండేది కాదు.

నాకు ఇద్దరు తమ్ముళ్ళు. నేను 10వ తరగతి చదివిన తరువాత 2000 సం॥లో వివాహం జరిగింది. నా భర్తది కూడా క్రైస్తవ కుటుంబమే కానీ నామకార్థంగా జీవించేవారు. వివాహమైన తరువాత ఊర్లో ఖాళీగా ఉంటున్న పరిస్థితులలో ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చాము. ఇక్కడ మా అక్క వాళ్ళు రామోజీ ఫిల్మ్‌సిటీలో పని చేసేవాళ్ళు. నా భర్త కూడా ఫిల్మ్‌సిటీలో జాయిన్ అయ్యాడు. ఆయన చాలా కోపంగా, మూర్ఖంగా ఎవరి మాటా వినేవాడు కాదు. అలా మూడు సంవత్సరములు గడిచిన తరువాత పాప పుట్టింది. ఆయనకి ఉన్న కోపం వలన డ్యూటీ పోయింది. మరల తిరిగి ఊరికి వెళ్ళిపోయాము ఊర్లో కూడా ఏ పనికి వెళ్ళకపోవడం వలన కుటుంబములో చాలా ఆర్థిక సమస్యలతో ఉండేవారము. ఇలాంటి పరిస్థితులలో  బాబు పుట్టాడు. ఆ సమయంలో మేము మరల హైదరాబాద్‌లోని అనాజ్‌పూర్‌కి వచ్చాము. ఇక్కడ ఒక చిన్న రూమ్ అద్దెకు తీసుకుని ఉన్నాము, మా తమ్ముళ్ళు కూడా నాతో పాటు ఉండేవారు.

అప్పుడు మా అక్క వాళ్ళు అనాజ్‌పూర్‌లో ఎపఫ్రా మినిస్ట్రీస్ చర్చికి వెళ్ళేవారు. నేను కూడా వాళ్ళతో పాటు చర్చికి వెళ్ళి, ఎపఫ్రా అన్నయ్య చెప్పే వాక్యము వినేదానిని. చిన్నప్పటి నుండి చర్చికి వెళ్ళేదానిని కానీ విశ్వాసం అంటే తెలియదు, దేవునిపై ఆధారపడి జీవించడం తెలియదు. నా కుటుంబములో  చాలా ఆర్థిక సమస్యలు ఉండేవి. యజమాని డ్యూటీకి వెళ్ళేవాడు కాదు,  పిల్లలని స్కూల్‌కి పంపించడానికి, రూమ్ అద్దె కట్టుకోవడానికి కూడా మా దగ్గర డబ్బులు ఉండేవి కావు, కుటుంబములో చాలా బాధాకరమైన పరిస్థితి ఉండేది. దేవుడు ఎందుకు నాకు ఈ పరిస్థితిని ఇచ్చాడు అని చాలా బాధపడుతూ ఏడ్చుకుంటూ ఉండేదానిని. ఆదివారం చర్చికి రావడం మొదలు పెట్టిన తరువాత, ఎపఫ్రా అన్నయ్య చెప్పే వాక్యం నా హృదయాన్ని తాకింది. కుటుంబములో ఏ విధమైన బాధలు, సమస్యలు ఉన్నా, ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా దేవుని మీద విశ్వాసముతో ఆయన మీద ఆధారపడి జీవించాలి అని చెప్పేవారు. అప్పుడు నాలో విశ్వాసం పెరిగింది. చిన్న వయసులో వివాహం జరిగింది. కుటుంబమును ఎలా కట్టుకోవాలో, ఎలా జీవించాలో  తెలిసేది కాదు. అన్నయ్య చెప్పే వాక్యము ద్వారా కుటుంబమును కట్టుకునే జ్ఞానముని కూడా దేవుడు అనుగ్రహించారు.

 లేనివాటికోసం నిరంతరం అదే పనిగా తపిస్తూ ఉంటే ఉన్నవాటి ప్రయోజనాన్ని కూడా పొందలేం.

అప్పుడు నా భర్త మందిరమునకు వచ్చేవాడు కాడు. తన స్వంత జ్ఞానముతో చాలా మూర్ఖంగా ప్రవర్తించేవాడు. మందిరానికి వెళ్దాము రమ్మని అడిగితే తిట్టేవాడు. అలా ఇరుకులు, ఇబ్బందులతో నా కుటుంబం ఉండేది. ఆ సమయములో నా బంధువులు ఎవ్వరూ పట్టించుకోక పోయిననూ పరిచర్యలో అందరూ చూపించే ప్రేమ, ఆప్యాయతా నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మా కుటుంబములో అన్నీ ఉన్నాయా? లేవా? అని అడిగి తెలుసుకునేవారు, ఆదరించేవారు. ఆ విధంగా నేను 2007వ సంవత్సరములో బాప్తిస్మము తీసుకున్నాను. కానీ నా మనస్సులో ఒక బాధ ఉండేది. మందిరములో అందరూ చాలా క్రమముగా, క్రమశిక్షణతో ఉండేవారు. మాకు ఏమీ లేకపోయిననూ నా భర్త కూడా మందిరమునకు రావాలని ఉండేది. దైవసేవకుల, సంఘ ప్రార్థనల ద్వారా ఆయన కూడా చర్చికి రావడం, అన్నయ్య వాక్యం వినడం, మార్పు చెంది బాప్తిస్మం తీసుకోవడం జరిగింది. నా భర్త పెయింటింగ్ పనులు చేసేవాడు. అలా చిన్న చిన్న పనులు దొరకడం వలన కుటుంబమును గడుపుకుంటూ, పిల్లల్ని స్కూల్‌కి పంపించడం కూడా జరిగింది. పనులు ఎప్పుడూ సరిగా ఉండేవి కాదు. పని ఉన్నప్పుడు సంతోషంగా, లేనప్పుడు నిరాశగా ఉండేదాన్ని. అప్పుడు దేవుని సన్నిధిలో నాకు కూడా పని కావాలి ప్రభువా అని ప్రార్థించినప్పుడు దేవుడు మంచి డ్యూటీని నాకు అనుగ్రహించారు. ఎక్కడో ఉండవలసిన నా కుటుంబమును దేవుడు ఈ పరిచర్యలో పనికి వచ్చే పాత్రగా ఉంచాడు. కుటుంబ యజమాని బాధ్యత లేని వ్యక్తిగా ఉన్నప్పుడు బాధ్యతతో జీవించే వ్యక్తిగా దేవుడు మార్చాడు. అలాగే కుటుంబములో కలిగే సమస్యలను బట్టి అధైర్యపడుతున్నప్పుడు వాక్యం ద్వారా బలపరుస్తూ, ఆత్మీయంగా శక్తినిస్తూ, కుటుంబములో ఏదీ తక్కువ కాకుండా నడిపిస్తున్న దేవునికి వందనములు. ఏ సమయములో ఏది అవసరమో వాటిని అనుగ్రహిస్తూ కృపలో మమ్మల్ని భద్రపరుస్తూ, సురక్షితముగా ఆయన రెక్కల నీడలో నిలిపి ఉంచిన దేవునికి స్తోత్రం. అలాగే మా చివరి శ్వాస వరకు దేవునిలో నమ్మకమైన కుటుంబంగా జీవించాలని నా తపన.


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

*అందరూ ఆహ్వానితులే....!*

**వివరములకు:**

9666666249 | 040-24202227

# ప్రార్థనా వీరునిగా ఉండడం ఎలా ?

యేసు మరణించవలసి ఉంది. సాతానుని ఎదిరించి, ఓడించవలసి ఉంది. సాతాను ఏలుబడి మరణపు ఏలుబడి. మరణించడానికి సమర్థుడైన వ్యక్తి రావాల్సి వచ్చింది. మరణపు రాజ్యం లోకి ప్రవేశించగల ఒకే ఒక్క మార్గం ఇదే. మరణపు రాజ్యంలోకి ప్రవేశించడం ద్వారా మన రక్షకుడు దానిని లోబరచుకొని, స్వాధీనపరచుకొనగల, లేక గెలువగల అవకాశాన్ని సాధించాడు. మరణం మీద విజయం పొంది మరణం, పాతాళం లేక నరకం (హెబ్రీ భాషలో 'షియోల్' అని, గ్రీకు భాషలో 'హదేస్' అని ఉంది) చేత చెరపట్టబడిన వారందరినీ విడుదల చేశాడు. "ఆయన మానవరూపంలో జన్మించడం వల్ల రక్త మాంసాలలో కూడా పాలివాడయ్యాడు; ఎందుకంటే కేవలం మానవునిగా మాత్రమే ఆయన మరణించగలడు. మరణించడం ద్వారా మరణ బలము గల అపవాది యొక్క అధికారాన్ని భంగపర్చగలడు." **"ఆ పిల్లలు రక్త మాంసములు గల వారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గల వానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకు.... ఆయన కూడ రక్త మాంసములలో పాలివాడాయెను".**

యేసు మరణించాడు. మరణించడంద్వారా మరణపు రాజ్యంలోకి ప్రవేశం సంపాదించాడు. ఆయన మరణాన్ని జయించాడు. ఖైదీలను విడుదల చేశాడు. మరణించిన నీతిమంతుల సమూహాన్ని సమాధులలో నుండి పరలోకానికి నడిపించాడు. "ఆయన ఆరోహణమైనప్పుడు చెరను చెరగా పట్టుకొని పోయి మనుష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడియున్నది. ఆరోహణమాయెననగా ఆయన భూమి యొక్క క్రింది భాగములకు దిగెననియు అర్థమిచ్చుచున్నది గదా" – ఎఫెసీ 4:8,9

యేసు మానవునికి అధికారాన్ని తిరిగి ఇచ్చాడు. క్రీస్తు సిలువ మీద మరణపు రాజ్యంలో, పాతాళంలో మరణం మీద విజయాన్ని పొందడం ద్వారా సాతానుని ఆధిపత్యం, ఏలుబడి తుదకు భంగమయ్యింది. నాశనం అయ్యింది. భూమి మీద మానవుడు ప్రభుత్వం చేయాలని, ఏలికగా ఉండాలని దేవుని ఉద్దేశం. యేసు వచ్చి జయించినప్పుడే అది సాధ్యమయింది. అందువల్లనే తన పునరుత్థాన దినాన **"పరలోకమందును, భూమి మీదను, నాకు సర్వాధికారము ఇయ్యబడి ఉన్నది. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నాను" అని ఆయన అనగలిగాడు. - మత్తయి 28:18,20** ఆయన పునరుత్థానుడైన తర్వాత 60 సంవత్సరాలకు పత్మసు ద్వీపంలో చెరసాలలో ఉన్న యోహాను వద్దకు వచ్చాడు. విజయోత్సాహంతో కూడిన ఆయన ప్రకటన ఇలా ఉంది. **"నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను; మృతుడనైతిని గాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను. మరియు మరణము యొక్కయు పాతాళలోకము**

**యొక్కయు తాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి"** - ప్రకటన 1:18 ఎంత మహిమాన్వితమైన సువార్త!

ఈ విధంగా దేవుడు ఏదేను తోటలో చేయనుద్దేశించింది జరగాలి. ఆదాము పోగొట్టుకొన్న హక్కును తిరిగి సంపాదించడానికి యేసు దేవుని రూపంలోనూ, పోలికలోనూ వచ్చాడు. దేవుని స్వరూపములో, పోలికలో ఉండే కుమారుల(పిల్లల) కుటుంబాన్ని ఏర్పరచడానికై యేసు వచ్చాడు. ఈ కుటుంబం తిరిగి దేవుని సృష్టి మీద అధికారం చేస్తున్నది. ఆధిపత్యం చెలాయిస్తున్నది. అందువల్ల యేసుక్రీస్తు మనుష్య కుమారునిగా వచ్చాడు. మనుష్య కుమారునిగా ఆయన సాతానును పూర్తిగా ఓడిస్తాడు. సాతాను శోధనలను గెలిచాడు. తన పునరుత్థానం ద్వారా మరణం మీద తాను సాధించిన విజయాన్ని నిరూపించాడు. మనుష్య కుమారునిగా ఆయన విజయం ఏదేను తోటలో పాపం ద్వారా పోయిన అధికారాన్ని, ఆధిపత్యాన్ని, మానవులందరికీ(దేవుని స్వరూపాన్ని, పోలికను ధరించుకోవడానికి ఇష్టపడే వారికి) తిరిగి సంపాదించి పెట్టింది. అధికారం మానవునికి తిరిగి ఇవ్వబడింది గనుక ఇప్పుడు దేవుడు మనం ప్రార్థించినట్లయితే మానవుని రాజ్యంలోకి, లేక అధికార పరిధిలోకి ప్రవేశించి తన చిత్తాన్ని నెరవేరుస్తాడు.

**అన్ని కాలాలకు, మానవులందరి కొరకు ఆయన సిలువ మీద సాతానును, వాడి అనుచరులను జయించాడు. "ఆయన ప్రధానులను, అధికారులను నిరాయుధులనుగా చేసి సిలువ చేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనుపరచెను" - కొలస్సీ 2:15**

ఆయన వారిని జయించడం మాత్రమే కాదు, "బాహాటముగా వేడుకకు కనుపరిచాడు" దీని అర్థమేమిటి? బైబిలు కాలంలో ఒక సైన్యాధ్యక్షుడు శత్రువులను జయిస్తే, గెలుపొందిన సైన్యం తమ విరోధుల సైన్యాధ్యక్షుణ్ణి, అతని దళాలను విజయం పొందిన సైన్యాధ్యక్షుని వెనుక ప్రజలందరి ఎదుట కవాతు చేయవలసిందిగా బలవంతపెట్టేవారు. మార్గానికి ఇరువైపులా ఉన్న ప్రజలు వారి మీద తిట్ల వర్షం కురిపిస్తూ ఓడిపోయిన వారి మీద రాళ్ళు రువ్వేవారు. దీనికి రాజైన దావీదు జీవితం నిదర్శనం, అతని కుమారుడైన అబ్షాలోము అతన్ని సింహాసన భ్రష్టుణ్ణి చేశాడు. "అంతట దావీదును అతని వారును మార్గమున .... వెళ్ళిపోవుచుండగా షిమీ అతని కెదురుగా కొండప్రక్కను పోవుచు అతని మీదికి రాళ్ళు విసురుచు ధూళి ఎగరగొట్టుచు నుండెను" - 2 సమూ 16:13

యేసు సిలువ వేయబడినప్పుడు ఆత్మల లోకంలో జరిగింది కూడా ఇదేనని పౌలు చెప్తున్నాడు. యేసు సాతాను శక్తులమీద, అపవిత్రాత్మల మీద విజయం సాధించాడు. సృష్టి యావత్తు "యేసు విజయం పొందాడు" అని రూఢిగా తెలుసుకొనేలా సాతానునూ వాడి

రాజ్యాధికారులనూ తన విజయోత్సవ ఊరేగింపులో అందరూ చూసేలా నడిపించాడు. ఆయన సాతాను శోధనలను జయించాడు. మరణం మీద తన విజయాన్ని పునరుత్థానం ద్వారా రుజువు చేశాడు. మనుష్యకుమారునిగా ఆయన పొందిన విజయం, ఏదేను తోటలో పాపం ద్వారా పోయిన అధికారాన్నీ, ఆధిపత్యాన్నీ మానవులందరికీ(దేవుని స్వరూపాన్ని, పోలికనూ ధరించుకోవడానికి ఇష్టపడేవారిని) తిరిగి సంపాదించి పెట్టింది. మన తండ్రి చిత్తాన్ని నెరవేర్చి ఈ భూమి మీద ఆయన రాజ్యాన్ని స్థాపించడానికై మనకు మరొకసారి శక్తి, అధికారాలు ఇవ్వబడ్డాయి. ఇప్పుడు మన ఆ ఆధికారాన్ని, ఆధిక్యతను ప్రార్థన మూలంగా కలిగి ఉన్నాం. మనం ప్రార్థించినప్పుడు, లేక ప్రార్థిస్తూ ఉండగా ఈ లోకం పట్ల దేవుని ఉద్దేశం, ప్రణాళిక క్రీస్తు సంఘం ద్వారా నెరవేర్చబడుతుంది. యేసు పరలోకపు శిరస్సు, అయితే మనం ఈ లోక అవయవాలం. ఆయన శరీరంగా ఏర్పడదాం. ఈ లోకంలో తన చిత్తాన్ని మన ద్వారా నెరవేర్చాలని దేవుడు ఉద్దేశించాడు. ఆయన లేకుండా మనం నెరవేర్చలేము. మనం లేకుండా ఆయన నెరవేర్చడు.

దేవుడు మన అధికారాన్ని గౌరవిస్తాడు. విడుదల పొందిన మానవునికి తాను అప్పగించిన అధికారాన్ని దేవుడు గౌరవిస్తాడు. ఆయన ఈ లోక రణరంగంలోకి ప్రవేశించక ముందు మనం ప్రార్థన మూలంగా ఆయన వద్దకు రావాలని ఆయన మన కొరకు ఎదురు చూస్తాడు. ఆయన మనకు అప్పగించిన అధికారాన్ని ఆయన గౌరవిస్తాడు. దానికి విలువనిస్తాడు. అందుచేత మనం కోరేవరకూ ఆయన పని ప్రారంభించడు లేక జోక్యం చేసుకోడు. వాస్తవంగా మన లోకంలో తనతో పనిచేసే వారెవరైనా లేనిదే దేవుడు పని చేయడు. ప్రార్థన ద్వారా ఆయన చిత్తాన్ని కనుగొని దానిని భూమిమీద నెరవేర్చగలవారు ఆయనకు అవసరం.



# ధనము.....



ఇది ఏమిటా అనుకుంటున్నారా? ఈ నవ నాగరిక ప్రపంచములో మన వాళ్ళు డబ్బుకి పెట్టుకున్న పేర్లు. మన దేశములో రూపాయిగా చలామణి అయితే, మరికొన్ని దేశములలో యూరో, డాలర్, పౌండ్‌గా చెల్లుబాటు అవుతుంది. ఇంకా అనేక దేశములలో అనేక పేర్లు, ఎన్ని పేర్లు ఉన్నా అన్ని దేశములలోనూ మానవుని జీవితమంతా వాటి చుట్టూనే తిరుగుతూ ఉంది అని అనుకోవడంలో వాస్తవం లేకపోలేదు.

డబ్బు సంపాదించుకోవడం కోసం ఎత్తుకి పై ఎత్తు వేస్తూ విలువలు కాలరాస్తూ, ముందుకి దూసుకుపోతున్న సమాజం, ఆర్థికంగా ఎదిగితే చాలు అన్ని విషయములలో ఎదిగినట్లే అనుకోవడం అజ్ఞానం అవుతుంది కదా! ప్రతిదినం ఏదో విధంగా డబ్బు అవసరం ఉంటూనే ఉంటుంది. డబ్బు అవసరముల కొరకే అయితే ఫర్వాలేదు కానీ, అదే ఊపిరిగా భావించే స్థాయికి దిగజారిపోయాము. అనేకమంది జీవితములలో ప్రేమ, అప్యాయత, అనురాగం అనే వాటిని ధనవ్యామోహం అనే చెద తొలిచివేసి అవి కేవలం అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. మనం లోతుగా ఆలోచిస్తే, ఒక చక్కటి సమాజం కొరకు మంచి కుటుంబాలు అవసరం. అనేక కుటుంబాల ద్వారా మంచి సమాజం నిర్మించబడుతుంది. ఆ కుటుంబాల పునాదే ధనార్జన మీద కట్టబడితే సమాజం ఏ విధంగా ఉంటుంది?

వివాహం ద్వారా కుటుంబం ఏర్పడడానికి కేవలం ధనమే ప్రామాణికం – ఇది నేటి మాట. వ్యక్తి వ్యక్తిత్వం ఇవన్నీ ఏ మాత్రం ముఖ్యమైనవిగా భావించకపోవడం మన దిగజారుడు తనానికి నిదర్శనం. ఇంతటి ప్రాముఖ్యమైన విషయమును గురించి ప్రతి వ్యక్తికి సరియైన అవగాహన అవసరం. కొందరు తెలిసి ఈ మార్గములో ప్రయాణిస్తూ ఉంటే మరికొందరు తెలియక ముందుకి వెళ్తున్నారు.

ఈ ఆర్టికల్ యొక్క ముఖ్య ఉద్దేశ్యము ధనాపేక్ష వలన కలిగే దుష్పరిణామములను తెలియపరచాలనేదే. రాబోయే సంచికలలో మరింత వివరముగా దీని గురించి తెలుసుకుందాము.

**(ఇంకా ఉంది)**

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

మన ప్రార్థలు శక్తివంతమైన ప్రార్థనలై ఉండాలి, మరియు మన జీవితములోనికి, మన చుట్టూ ఉన్నవారి జీవితములోనికి దేవుని ప్రణాళికలను, దేవుని హృదయమును కలుగజేయునట్లుగా ఉండాలి.

"నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై, బహు బలము గలదై యుండును" – యాకోబు 5:16 అని బైబిల్ చెబుతుంది. మన ప్రార్థనలు కూడా బహుబలముగలవై యుండాలంటే, వాటి గురించి దేవుడు ఏమి చెప్తున్నారో తెలుసుకోవలసి ఉంది, ఎందుకనగా మన ప్రార్థనలన్నీ ఖచ్చితంగా విజయవంతమవుతాయని లేదు. కొన్నిసార్లు మనకు చాలా అవసరమైన వాటిని దేవుని చిత్త ప్రకారం ప్రార్థించి అడగడంలో విఫలమవుతాము. మరియు ఆ ప్రార్థనలు ప్రభావవంతంగా ఉండవు. మనం కొన్ని సమయములలో, కొన్నిసార్లు బాగా కోపంతో లేక బాధతో దేవుని మనస్సుతో (లేక) చిత్తముతో సంబంధం లేకుండా ఉద్రేకములను ఆధారంగా చేసుకొని ప్రార్థిస్తుంటాము. ఆ ప్రార్థనలు కూడా ప్రభావవంతంగా ఉండవు.

శక్తివంతమైన ప్రార్థనలు దేవుని వాక్యముపై ఆధారపడి ఉంటాయి. అవి సులువైనవి, నిజాయితీ కలిగినవి, విశ్వాసముతో నింపబడినవి నియమ, నిబంధనలతో వాటికి పనిలేదు. అవి హృదయ భావనలకు సంబంధించినవై యున్నవి. మన క్రైస్తవ జీవితములలో ఒక దశ మరియు – ప్రభావవంతమైన ప్రార్థనలకు స్థితి – దేవుని యెడల మన ప్రేమను వెల్లడి చేయుట లోబడుటయై యున్నది. ఆయనకు లోబడడానికి మనం ఇష్టపడకుండా దేవునితో సంబంధాన్ని కొనసాగించలేము, మరియు ప్రార్థనలో శ్రేష్ఠంగా ఉండలేము. ఏ విధమైన అవిధేయత అయినా అది ఏ స్థాయిలో ఉన్నప్పటికీ పాపమై యున్నది. విజయవంతముగా ప్రార్థించుట నుండి పాపము మనలను దూరముగా ఉంచినట్లే, నిజముగా ప్రభావవంతమైన, ఫలవంతమైన ప్రార్థనలు ప్రార్థించుటకు దేవునికి లోబడుట ఒక దారిని కలుగజేస్తుంది. సమూలంగా దేవునికి లోబడుట అనేది దేవునితో ఉత్సాహకరమైన మరియు మనలను ఆశ్చర్య చకితులిని చేసే జీవితంలోనికి నడిపిస్తుంది. సమూలంగా దేవునికి లోబడుతున్నానని మన మనస్సును మనం సిద్ధం చేసుకోవాలి. "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక, మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును" అని 1 యోహాను 3:22 చెప్తుంది. పొరపాట్లు చేసేవారిని కూడా దేవుడు తన కృపలో ఆశీర్వదిస్తాడన్నది నిజం. అయితే మనం ఉన్న విధానంలోనే మనం తృప్తి చెందకూడదు. మనం లోపరహితులం అయినప్పటికీ దేవుడు ఆశీర్వదిస్తాడు, అదే సమయములో మన హృదయములు ఎదుగుదల

మరియు అభివృద్ధి కొరకు అపేక్షించాలి.  అవిధేయతలో జీవించడానికి ఇష్టపడక మార్పు చెందాలని అనుకుంటూ, ఆ దిశగా ప్రయాసపడుతూ ఆయన సన్నిధిలో ప్రార్థించుకునే వారిగా ఉండాలి. మనం దేవునికి లోబడని ప్రతిసారీ మనలను మనం బాధపెట్టుకుంటున్నాము. ఎవరికైనా క్షమాపణ చెప్పమని దేవుడు చెప్పినప్పుడు "నన్ను క్షమించండి" అని చెప్పలేనంత తలబిరుసుతనం చూపినట్లైతే మనలను మనం బాధ పెట్టుకుంటున్నాము మరియు మన ప్రార్థనా జీవితములకు వ్యతిరేకముగా ప్రభావితం చేస్తున్నాము. అయితే ఎప్పుడైతే మనం దేవునికి లోబడతామో మనలను మనం జవాబులు పొందు ప్రార్థనలకు, ఆశీర్వాదములకు తగిన స్థానములో నిలువబెట్టుకుంటున్నాము. పాపము చేసినప్పటికీ పశ్చాత్తాపపడువారు ఆశీర్వదించబడతారు. మనం మన పాపములను ఒప్పుకుని పశ్చాత్తాపపడి వాటి నుండి తిరుగుటకు ఇష్టపడాలి. లోబడు వారికి వచ్చు ఆశీర్వాదముల గురించి బైబిల్ చెపుతున్న విషయములు :

- "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచినయెడల మీరు సమస్త దేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు" – నిర్గమ 19:5
- "నీ దేవుడైన యెహోవా దృష్టికి యుక్తమును యథార్థమునగు దానిని నీవు చేసినందున నీకును నీ తరువాత నీ సంతతివారికిని నిత్యము మేలుకలుగునట్లు నేను నీకాజ్ఞాపించుచున్న యీ మాటలన్నిటిని నీవు జాగ్రత్తగా వినవలెను" – ద్వితీ 12:28
- "మరియు నీ దేవుడైన యెహోవా నీ చేతి పనులన్నిటి విషయములోను, నీ గర్భఫల విషయములోను, నీ పశువుల విషయములోను, నీ భూమి పంట విషయములోను నీకు మేలుకలుగునట్లు నిన్ను వర్ధిల్లజేయును, ఈ ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన ఆయన ఆజ్ఞలను కట్టడలను నీవు గైకొని, నీ దేవుడైన యెహోవా మాట విని, నీ పూర్ణహృదయముతోను, నీ పూర్ణఆత్మతోను నీ దేవుడైన యెహోవా వైపు మళ్ళునపుడు యెహోవా నీ పితరులయందు ఆనందించినట్లు నీకు మేలు చేయుటకు నీయందును ఆనందించి నీవైపు మళ్ళును." – ద్వితీ 30:9,10
- "మీరు ఆలకించి ఆయనను సేవించిన యెడల తమ దినములను క్షేమముగాను తమ సంవత్సరములను సుఖముగాను వెళ్ళబుచ్చెదరు" – యోబు 36:11

–సేకరించబడినది, ఇంకా ఉంది

జాయిస్‌మేయర్




# బైబిల్ క్విజ్ -51

(యోబు గ్రంథం నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.

**1.** నేను నక్కలకు సోదరుడనైతిని, నిప్పుకోళ్ళ జతకాడనైతిని. అని చెప్పిందెవరు?

**2.** 'నిప్పురవ్వలు పైకి ఎగురునట్లు నరులు శ్రమానుభవమునకే పుట్టుచున్నారు' అని ఎవరు చెప్పారు?

**3.** తుమ్మినప్పుడు దేని వెలుగు ప్రకాశిస్తుంది?

**4.** "నా ప్రవర్తన అంతటి విషయములో నా హృదయము నన్ను నిందింపదు" అని ఎవరు పలికారు?

**5.** దేవుని కుమారులతో పాటు యెహోవా సన్నిధికి ఎవరు వెళ్ళారు?

**6.** కుమారులతో పాటు తన కుమార్తెలకు కూడ స్వాస్థ్యమిచ్చిన తండ్రి ఎవరు?

**7.** 'గ్రుడ్డులోని తెలుపులో రుచి కలదా? అని ఎవరు చెప్పారు?

**8.** దేవుడు ఏ పక్షికి తెలివి, వివేచనాశక్తి ననుగ్రహించలేదు?

**9.** నేను పెట్టిన అడుగెల్ల నేతిలో పడెను అని చెప్పిందెవరు?

**10.** భూమి లోపలిభాగం అగ్నిమయమై ఉందని ఎవరు ప్రకటించారు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే 2017 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 50 జవాబులు (ఎస్తేరు) :</u>**

| | |
|---|---|
| **1.** అహష్వేరోషు 1:1 | 2. ఎస్తేరు 1:1 |
| 3. అబీగయీలు 2:15 | 4. ఎస్తేరు |
| 5. మొర్దెకై 3:2 | 6. బిగ్తాను, తెరెషు 2:21 |
| 7. మొర్దెకై 2:10 | 8. నక్షత్రం, హదస్సా 2:7 |
| 9. హర్బోనా 7:9 | 10. వష్తి 1:12-19 |

**<u>బైబిల్ క్విజ్ - 50 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

సౌజన్య, షీబారాణి, హెప్సిబా, షకీనా ఇవాంజలిన్, పాప రమేష్, రాజు ఫ్లోరెన్స్, ఐజాక్ కుమారి, సుశీల, వీణ ప్రసన్న

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి - ఏప్రిల్

**భాగ్యలత** : రాజేశ్వరి, వసుంధర, శ్రీవిద్య, స్వప్న, ప్రాముఖ్య, కోటేశ్వరి, రత్నాకర్, గోపీనాధ్, జ్యోతి, లత(యేసమ్మ), విక్రమ్‌కుమార్, సుమలత, నాగమణి, విస్మయ్, ఐలయ్య, వినోద్, సుష్మ, రూతు, బ్యూలా, జగన్, మేఘ, సాత్విక, హరీష్ బాబు, రజని, సుహాసిని, హెప్సిబా, కృపారాణి, సిద్ధమ్మ, సువర్ణరత్న, పుష్పావతి, రిష్విన్‌రాజు, కీనస్విన్, యోజస్వి, షారోన్, అభినయ, బోయజ్, శ్రీవాణి, వెంకటరమణి, సురేష్, గోపీచంద్, పార్వతి, అరుణ, కిరణ్, జయశీల, రజిత, ప్రియాంక, నోయాగ్రేస్, నిరీక్షణ్, తేజ, నమ్రత, విజయకుమారి, కృష్ణవేణి, సింధూర, లలితాసాయి, ఎలీషాబాబు, అనూష, సూచన, బాలచంద్ర, ప్రసన్న, శేషగిరిరావు, అభిషేక్, విశ్వాస్, రాజేష్, జాన్‌విక్టర్, విజయ, వర్షిణి, శ్రీనివాసరావు, శ్రీదేవి, పద్మ, గోపాల్, రాజు, జీవన్, దీపిక, శ్యామల, పాధ్విక, కెజియా, మధురిమ, వాత్సల్య, పద్మాకర్, పర్ణిక, జయ, కృపారావు, కళ, జిన్నిబాబు, ఏలియా, పుష్పలత, నోవా, శ్రీకాంత్‌రవి, సలోమియ, తిమోతి, మోజెస్, సుజాత, గీత, రాహుల్, గంగేయుడు, సందేశ్, బందేశ్, గ్రీష్మ, మాధురి, జయమ్మ, నరసింహరావు.

**చింతల్** : రాజేష్, జయానంద్, బాలరాజు, రాణి, శ్రీకాంత్, స్నేహ, శాంతిప్రియ, విజయ్, రాధామణి, సూర్యదీపిక, శిరీష, జీవన్‌కుమార్, హేమకుమారి, సురేంద్ర, అనంతరావు, సుధాకర్, మైఖేల్, డేవిడ్, రాజామన్నార్, విజయ, మోహన్.

**అనాజ్‌పూర్** : ప్రభుదాస్, మరియమ్మ, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రూతు, రమేష్‌బాబు, పీటర్, డేవిడ్, పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, కృపావరుణ్,మణెమ్మ, మహిమ, భిక్షపతి, జాస్మిన్, సిద్ధు, అక్షయ్‌కుమార్, అవినాష్, రాజేష్, సరోజిని, శశాంక్‌బాబు.

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



2017, జనవరి 26వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో
అనేకులు పాల్గొని దేశం కొరకు ప్రార్థించడం జరిగినది.

2017, జనవరి 26వ తేది ఉపవాస ప్రార్థనలో పాల్గొనిన విశ్వాసులు.





# ఎపఫ్రా మినిస్ట్రీస్


ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras